
# ఆఖరి ప్రార్థన

-కాకాని కమల-



సుబ్బయ్యకి జ్వరం విపరీతంగా వుంది. ఒళ్లు నిప్పులా కాలిపోతూంది. శరీరంలో రకరకాల రుగ్మతలు చేరి చాలా కాలంగా పీడిస్తున్నాయి. అయినా అలాగే రోజులు నెట్టుకొని వస్తున్నాడు.

''ఇంక నీ పరిస్థితి రోజుల మీద వుంది. మహాఅయితే వారం పది రోజులు ఏ క్షణం ఏద్దైనా కావచ్చు. నీకు అయినవాళ్ళు ఎవరన్నా వుంటే వాళ్ళ దగ్గరకి వెళ్ళటమో లేదూ నీ దగ్గరకి పిలిపించుకోవటమో మంచిది'' అన్నాడు డాక్టరు.

సుబ్బయ్య గుండె బాగా ఎనలార్జి అయ్యింది.

ఊపిరి తీసుకోవటం కష్టంగా వుంది.

''ఇంక వైద్యం అనవసరం. నువ్వేదో ఫీజు ఇస్తున్నావ్. కాదన్ను. కాని ఏ వైద్యం నీకింక పనికిరాదు. గుండె బాగా ఎన్లార్జి అయిపోయింది'' అన్నాడు డాక్టరు.

సుబ్బయ్య వంటరివాడు. 'నా'అన్నవాళ్ళు ఎవరూ లేరు. చాలారోజులు బ్రతుకుతెరువు దొరక్క రోడ్డమ్మట తిరిగాడు. పని దొరికిన నాడు చేసి, దొరకని నాడు అడుక్కుని ఊళ్ళు తిరుగుతూ బ్రతికిన రోజులు ఎన్నో. కాని-

ఆ ఊరు వచ్చాక నడిచి నడిచి అలిసిపోయిన సుబ్బయ్యకి ఊరి చివర పొలాల మధ్య ఒక కొండ దిగువగా వున్న శిథిలమైన చిన్న అమ్మవారి గుడి ఆశ్రయం ఇచ్చింది. అప్పటికే పది మైళ్ళు దాకా నడిచాడు. ఇంక నడవ లేక ఆ గుడి మండపంలో విరిగిన అరుగుమీద కూర్చున్నాడు. చల్లగా పైరగాలి గలగల పారే సెలయేరు, గుడి ముందు నాచుపట్టి తామర పూలతో నిండిన కొలను.

గుడి ముందు చిన్న రాతి స్తంభంతో సగం విరిగిన పురాతన స్తంభం. నేల మాళిగలో తలుపులు విరిగిన చిన్న గది. గుడి పూర్తిగా శిథిలం అయి గబ్బిళాలు పట్టింది. అమ్మవారి కుడి భుజం దగ్గర్నించి కాళ్ల భాగం కొంత విరిగి వుంది. నల్లని రాతి విగ్రహం, ముఖం మాత్రం కళకళ లాడి పోతూంది ఆ తల్లిది.

ఆరోజు బాగా వర్షం పడింది. దాంతో ఆ నేలమాళిగ గదిలో తల దాచుకున్నాడు సుబ్బయ్య.

బాగానే వుందనిపించింది.

ఆ మర్నాడు పొలం గట్లమ్మట వున్న కందికంపను ఏరి తెచ్చి చీపురు కట్టి గుడంతా శుభ్రం చేశాడు. ఆ కంపలు కాల్చి పొగ పెట్టి గబ్బిలాల్ని తరివేశాడు. కాలవ లోంచి నీళ్ళు తెచ్చి శుభ్రంగా మండపం, గర్భగుడి, నేలమాళిగ, గది కడిగాడు. ముగ్గులు పెట్టాడు. మామిడాకులు, వేపాకులు కలిపి తోరణంగా మండపాలకి, గర్భగుడికి కట్టాడు. ఫండ్స్ లేక ఆలయాన్ని పునరుద్ధరించలేదుట. పైగా విరిగిన విగ్రహానికి పూజలు చెయ్యకూడదుట. ప్రభుత్వం ఆ చిన్న గుడిని తీసుకుంటుందని కొందరు అంటున్నారుట. కాని అలాంటిదేం జరగలేదని, ప్రైవేటుగా ఎవరన్న ఉద్ధరించినా, తిరిగి ప్రభుత్వం తీసుకొంటే ఆ జాగా విషయంలో తగాదాలు వస్తాయని ఎవరూ అసలు పట్టించుకోవటం లేదుట.

పొలం పనులకి వచ్చిన రైతులు చెప్పారు. 'నన్ను ఆ నేలమాళిగ గదిలో వుండనిస్తే ఆ ఆలయాన్ని నిత్యం నేను శుభ్రంచేసి దేవత ముందు దీపం వెలిగిస్తాను'' అన్నాడు.

'నీ ఇష్టం. ఆ గుడి గురించి అడిగే దిక్కు లేదు. కోర్టులో వుంది. నువ్వు దీపం పెడితే పెట్టు. మీరు బ్రాహ్మణులా?' అన్నారు రైతన్నలు. సుబ్బయ్య వెంటనే జవాబు చెప్పలేకపొయ్యాడు. తడబడ్డాడు. మనిషి ఎర్రగా పండులా వున్నాడు. కాస్త పొట్టిగా లావుగా వున్నాడు. మల్లు చొక్కా పంచె.

'మీరు బ్రాహ్మణులే అయి వుంటారు. ముఖం చూస్తే తెలుస్తుంది'' అన్నారు మళ్ళి.

ఆరోజునుంచి సుబ్బయ్య జీవితం మారిపోయింది. జంధ్యం కొని తెచ్చుకుని వేసుకున్నాడు. తన దగ్గరున్న డబ్బుతో రెండు చౌక రకం సిల్కు పంచెలు, కండువా కొని తెచ్చుకున్నాడు.

రోజూ చీకటితో లేవటం, గుడిసె శుభ్రం చెయ్యటం, అమ్మవారికి స్నానం చేయించి అడివిపూలు ఏవి దొరికితే అవి తెచ్చి అరటి నారతో మాల గుచ్చి ఒళ్ళంతా అలంకరించడం, పసుపు కుంకాలు అద్దటం, గుడి మండపంలో సుద్దతో ముగ్గులు పెట్టటం, మట్టి ప్రమిదలో దీపం వెలిగించి, చిన్న కటకటాల తలుపువేసి గడియ పెట్టడం. రోజూ తలారా స్నానం చేసి నుదుట, విభూది రేఖలు, గంధం బొట్టు మధ్య కుంకుమా అక్షతలు ధరించటం, ఎర్ర సిల్కు పంచె కట్టి కండువా భుజాలు చుట్టు కప్పుకోవడం, చేతికి కాశీతాడు కట్టుకొని మెళ్ళో రుద్రాక్ష వేసుకొని ఊళ్ళోకి వెళ్ళి రోజూ నాలుగిళ్ళు యాచించటం. తనకి వచ్చిన పంచాక్షరి రామనామం వల్లించటం. ఏరోజు సరిపడ్డ ఆహారం ఆరోజువరకు సంపాదించుకొనేవాడు. కూడబెట్టాలన్న ఆశ లేదు. ఎవరు ఏది ఇస్తే అది తెచ్చుకోవడం.

గ్రామం అంతా పాడిపంటల నిలయం. రైతాంగం, బియ్యం పప్పు కూరగాయలు, ముంతలో మజ్జిగ, పాలు ఎవరికి తోచింది వాళ్ళు ఇచ్చేవారు. ఇంటికి తెచ్చుకొని వండుకు తినేవాడు. రోజూ పొట్టకి సరిపడ స్వయంపాకం దొరికేది. కొందరు భూకామందులు పది ఇరవై డబ్బు కూడా ఇచ్చేవారు.

''విరిగినా అది అమ్మవారి విగ్రహమే. ఏదో దీపంపెట్టి నిత్యం కడిగి ముగ్గులు పెడుతున్నాడు. మన వూరి ఇలవేల్పు ఆ తల్లి. సర్కారు గొడవలో కోర్టులో వుండటంవల్లగాని లేకుంటే మనమే ఆ గుడిని ఉద్ధరించేవాళ్ళం'' అనుకున్నాడు.

గుడి చుట్టు కంపలతో కంచె కట్టి నేలలో గన్నేరు, తులసి,

''విరివిగా అది అమ్మవారి విగ్రహమే. ఏదో దీపంపెట్టి నిత్యం కడిగి ముగ్గులు పెడుతున్నాడు. మన వూరి ఇలవేల్పు ఆ తల్లి. సర్కారు గొడవలో కోర్టులో వుండటం వల్లగాని లేకుంటే మనమే ఆ గుడిని ఉద్ధరించే వాళ్లం''

మందారం, మారేడు, నందివర్ధనం లాంటి చెట్లు నాటి నిత్యం రెండుపూట్లా నీళ్ళు పోసేవాడు. ఊరంత పొలాలు, కాలువలగుండా గోదావరి జలాలు. నీళ్ళకి లోటు లేదు.

దగ్గర దగ్గర పదేళ్ళు గడిచాయి.

సుబ్బయ్య వచ్చాక శిథిలాలయం శుభ్రపడింది. కాని గుడి బాగుపడలేదు. ఇంకా శిథిలం అయ్యింది. సుబ్బయ్య నాటిన చెట్లు పెరిగి పూలు పూస్తున్నాయి. కాని సుబ్బయ్య బ్రతుకు చెట్టు ఎండిపోతూంది. సుబ్బయ్యకి అంత్యకాలం సమీపించింది.

సుబ్బయ్య గుండె బాగా ఎన్‌లార్జి అయింది.

ఊపిరి తిత్తులు చెడిపొయ్యాయి.

శ్వాస పీల్చి వదలటం చాలా కష్టంగా వుంది. ఊళ్ళో డాక్టరున్నాడు.

వైద్యం చేయించుకొంటునే ఉన్నాడు.

అయినా సుబ్బయ్య రోగం వైద్యానికి లొంగే దశ దాటింది. సుబ్బయ్య స్థితి రోజుల్లోకి వచ్చింది.

'ఎక్కువ రోజులు బ్రతకడు సుబ్బయ్య' అని డాక్టరు హెచ్చరించాడు.

వైద్యం అనవసరం అన్నాడు.

సుబ్బయ్యకి కూడా మృత్యుస్పర్శ తెలుస్తుంది.

పక్క దిగలేకపోతున్నాడు.

ఊళ్ళోకి నాల్గు దినాలకి ఒకసారి వెళుతున్నారు. పొలాలకి వచ్చిన రైతులే ఏదో ఇచ్చి పలకరించి వెడుతున్నారు.

ఆరోజు లేస్తూనే ఎందుకో సుబ్బయ్యకి అనిపించింది. రేపటి సూర్యోదయం చూడనేమో... అనిపిస్తుంది. శుచిగా కోనేట్లో స్నానం చేసి, నుదుటికి ఒంటికి విబూది రాసుకుని, నుదుట గంధం అక్షితలు కలిపిన బొట్టు పెట్టుకున్నాడు. దానిపైన కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు. ఉతికి ఆరేసిన ఎర్ర సిల్కు పంచె కట్టుకొని కండువా భుజాల చుట్టు కప్పుకున్నాడు. చిన్న గ్లాసులో తులసి ఆకులువేసి కాలువలోని గోదావరి నీటితో గ్లాసు నింపాడు. ఆ గుడి మండపంలో అమ్మవారి విగ్రహానికి ఎదురుగా పద్మాసనం వేసుకుని కూర్చుని రెండు చేతులు జోడించాడు. ఎనిమిది చేతుల్తో ఆ అమ్మవారి నల్లరాతి విగ్రహం కలకలలాడిపోతూంది.

కొన్ని చేతులు విరిగి ఉన్నాయి.

అయినా ఆమె దేవతే. అది గుడే!

కళ్ళు విప్పార్చి ఆ విగ్రహంలోకి చూస్తూ సుబ్బయ్య మనసులోనే ఇలా అనుకున్నాడు-

"అమ్మా తల్లీ... ఒక పూట తిని ఒక పూట తినక బికారిలా తిరిగే నాకు నీ శిథిలాలయం తల దాచుకోను ఇంత నీడ ఇచ్చింది. జన్మతః బ్రాహ్మణున్ని కాకపోయినా జందెం వేసుకుని, పట్టుబట్ట కట్టి, నుదుట విబూది రేఖలు పెట్టి మెళ్ళో రుద్రాక్షల దండ వేసుకుని బ్రాహ్మణుని వేషం ఎత్తాను...



ఆరోజు లేస్తూనే ఎందుకో సుబ్బయ్యకి అనిపించింది. రేపటి సూర్యోదయం చూడనేమో... అనిపిస్తుంది. శుచిగా కోనేట్లో స్నానం చేసి, నుదుటికి ఒంటికి విబూది రాసుకుని. నుదుట గంధం అక్షితలు కలిపిన బొట్టు పెట్టుకున్నాడు. దానిపైన కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు.

కూటికోసం కోటి విద్యలు అన్నారు.

బ్రాహ్మణుడిగా అవతారం ఎత్తి నీ పేరు చెప్పుకుని యాచించాను. నీ శిథిలాలయానికి వచ్చాకనే నాకు ఈ ఆలోచన వచ్చింది. ఈ వృత్తి మొదలు పెట్టాను. పూజరిగా నీ సేవలు మొదలుపెట్టాను తల్లి. తప్పే చేశానో ఒప్పే చేశానో నాకు తెలియదు. బ్రతుకు తెరువుకోసం చేశాను. నీకు అపచారం చేస్తున్నానన్న వేదన నా అంతరాత్మని ప్రతి క్షణం కలచి వేస్తూనే వుంది. కాని బ్రతుకుమీద ఆశ నన్ను ఈ పని చేయించింది. నీ అండకి వచ్చాక ఆకలికి మాడింది లేదు. రేపటికి వెతుక్కోనక్కర్లేకుండా రోజులు గడిచిపొయ్యాయి...

నీకు నావల్ల అపచారం జరిగినా నేను మాత్రం సంతోషంగానే వున్నాను. చివరిరోజుల్లో నీ సేవ చేసుకున్నానన్న ఆత్మతృప్తి వుంది...

బ్రాహ్మణేతరులు పూజాదికాలకి పనికి రాడంటారు. నిన్ను తాకకూడదు అంటారు. గర్భగుడిలో ప్రవేశించరాదు అంటారు. కాని నేను అవన్నీ చేశాను. నిత్యం నీకు పసుపు నీటితో స్నానం చేయించాను. పసుపు కుంకాలు, పూలమాలలు అలంకరించాను. విరిగిన విగ్రహాలకి పూజలు చెయ్యకూడదంటారు. కాని నేను అదీ చేశాను.

తప్పులే చేశానో ఒప్పులే చేశానో నన్ను మన్నించు తల్లి. పిల్లలు తప్పు చేస్తే అమ్మ కోపగించుకోదు కదా? మరి మా అందరికి తల్లివి నువ్వే. పోచమ్మవి (పోషమ్మవి). పోషించే అమ్మవి. మైసమ్మవి (మహి + అమ్మ), ఎల్లమ్మవి (ఎల్లరమ్మవి) నీ బిడ్డలం మేం అందరం. నీ బిడ్డ ఆకలితో మాడ్చుతుంటే ఏ తల్లి సహించగలదు? అందుకే నీ పేరు చెప్పుకొని పట్టెడన్నం తిన్నాను. ఇదీ నీ దయే అనుకున్నాను...

ఇంక నాకు శక్తి వుడిగిపోయింది. ఈ భూమిపై ఋణం తెల్లిపోయింది. నీ దగ్గరకే వచ్చేస్తున్నాను.

అక్కడ కూడా నీ సేవలు చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించు తల్లి.

సుబ్బయ్య కళ్ళ నిండా ఏదో మూగ వేదన.

శరీరం అణువు అణువునా మృత్యుస్పర్శ.

శిథిలాలయంలో అమ్మవారి ఎదురుగా విగ్రహంలోకి చూస్తూ వుండిపొయ్యాడు.

ఉదయంనుంచి గ్లాసుడు తులసి తీర్థం తప్ప ఏది ముట్టుకోలేదు.

కళ్ళు తెరిచి అలా దేవతా విగ్రహంకేసి చూస్తూ వుండిపొయ్యాడు.

రెండు నిమిషాల తరువాత అలాగే పక్కకు ఒదిగిపొయ్యాడు.

కళ్ళు తెరిచే ఉన్నాయి.

ప్రాణం పోయింది.

బర్రెలు కాసే కుర్రాడు లొల్లాయి పదం పాడుకుంటూ గుడిముందు నుంచి పశువుల్ని తోలుకుంటు వెడుతున్నాడు.

మండపంలో కళ్ళు తేలేసి వెడుతున్న సుబ్బయ్యని చూశాడు.

గగ్గోలుగా కేకలు పెట్టుకుంటూ ఊళ్ళోకి పరిగెత్తాడు. ఈ విషయం చేరెయ్యటానికి. ★

## పగలు ఛాయ్‌వాలా, రాత్రి రచయిత!

లక్ష్మణరావు అతని పేరు. 50 ఏళ్లు. అతనొక ప్రతిభావంతుడైన రచయిత. వృత్తి రీత్యా పగలు టీ అమ్ముతాడు. రాత్రి సమయంలో రచనలు చేస్తాడు. ఇప్పటికి లక్ష్మణరావు 16 నవలలు, కొన్ని నాటకాలు వ్రాశాడు. ఢిల్లీలోని విష్ణుదిగంబర్ మార్గ్‌లోనికి వెళ్లిన వారికి, ఆ ప్రాంతాలలో లక్ష్మణరావును కలుసుకోవడం బహు తేలిక. కష్టమర్లకు టీ అందిస్తూ, అభిరుచి గల వారికి తన పుస్తకాలు అమ్ముతూ కనిపిస్తాడా రచయిత- అయిన టీవాలా. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని వ్యవసాయదారుని కుటుంబంలో లక్ష్మణరావు జన్మించాడు. పుస్తక పఠనం పట్ల ఆసక్తి, ప్రాణ స్నేహితుడు రామదాసు మరణం అతన్ని రచయితను చేశాయి.

మాతృ భాష మరాఠీ అయినప్పటికీ, ఆదినుంచీ హిందీ భాష పట్ల మక్కువ పెంచుకున్నాడు. క్రమేపీ హిందీ సాహిత్యంపై ఆసక్తిపెరిగి, భాషపై పట్టు సాధించాడు. నాగపూర్ వర్శిటీనుంచి హిందీ మీడియంలో లక్ష్మణరావు 10వ తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. కొన్ని కుటుంబ పరిస్థితుల వల్ల చదువు సాగలేదు. చివరికి జేబులో 40 రూపాయలతో భోపాల్ వదిలాడు ఉద్యోగం అన్వేషణ కొరకు. కొంతకాలం అపార్ట్‌మెంట్ పనుల్లో కూలీగా కాలం గడిపాడు. ఆ వృత్తి నచ్చక తాను రచయితను కావాలనే భావం బలంగా ఏర్పడడంతో, ఎన్నో ఆశలతో ఢిల్లీ చేరాడు. అక్కడ పొట్టగడవక తాపీ పనివానిగా, హోటల్లో పాత్రలు కడిగి ఎన్నెన్నో కష్టాలు పడి తన చదువు కొనసాగించి, చివరకు ఢిల్లీ యూనివర్శిటీ నుంచి పట్టభద్రుడయ్యాడు. పిమ్మట రెండేళ్లు బతుకు బండిని అతి కష్టంమీద లాగుతూ, విష్ణుదిగంబర్ మార్గ్‌లో టీ దుకాణాన్ని తెరిచాడు.

1979లో తన తొలి నవల 'నమూ దునియాకి నమూ కహానీ' వ్రాశాడు. అహోరాత్రులూ కష్టించి, అవసరమైన ధనాన్ని పొదుపుచేసి, సొంతంగా నవలను ప్రచురించగలిగాడు. పిమ్మట 'నర్మద' 'రామ్‌దాస్' 'రాష్ట్రపతి' నవలలు వ్రాశాడు. లక్ష్మణరావుకు 'ఇంద్రప్రస్థ సాహిత్య భారతి' పురస్కారం లభించింది. ఇందిరాగాంధీ పట్ల అతనికి ఆరాధనాభావం హెచ్చుగా ఉండేది. కొన్నిసార్లు ఆమెను కలుసుకొని ముచ్చటించాడు. తాను ఇందిర జీవిత చరిత్ర వ్రాయాలనే తలంపుతో ఉన్నానని చెప్పగా, ఆమె ప్రధానమంత్రుల కార్యకలాపాలు, వారి సమస్యలు, ఆందోళనలను గురించి వ్రాయమని సలహా ఇచ్చారు అతనికి. ఆ విధంగా లక్ష్మణరావు వ్రాసిన 'ప్రధానమంత్రి' నవల రూపుదిద్దుకొంది! పబ్లిషర్ల చుట్టూ తిరిగి బాధలు పడలేక లక్ష్మణరావు తానే స్వయంగా పుస్తక ప్రచురణ ప్రారంభించాడు. దేశం మొత్తంమీద ఓ ప్రచురణ సంస్థను ఓ వృక్షం నీడలో నెలకొల్పిన వాడు ఒక్క లక్ష్మణరావే! తన పుస్తకాలు పబ్లిషర్లు ప్రచురించకపోవడానికి కారణం తాను పేదవాణ్ణనీ, ఛాయ్ వాలాననీ అంటాడు లక్ష్మణరావు. అతని వద్ద ప్రచురణకు సిద్ధంగా 12 పుస్తకాలు ఉన్నవి.

ప్రసుతం ఆ రచయిత 'భారతీయ రాజనీతి'పై ఓ పుస్తకాన్ని వ్రాస్తున్నాడు. అప్పుడే 653 కాపీలకు ఆర్డరు సంపాదించగలిగాడు. మన దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులను గురించి విశ్లేషిస్తూ తాను 'రాజనీతి' రచనను సాగిస్తున్నట్లు లక్ష్మణరావు చెప్పాడు.

**-కొడిమెల**